క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.40 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన గణేష్ కుటుంబ సభ్యులు గురువారం రూ.40 వేలు విరాళం ఇచ్చారు. వారు మొత్తాన్ని ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. ఆయన వారికి స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు.

నేడు సత్యవేడు మండల మీట్

సత్యవేడు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. మండల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

28న మండల సమావేశం

వరదయ్యపాళెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధిహామీ మస్టర్ల పరిశీలన



మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం అటవీ ప్రాంతంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉపాధి కూలీలు ట్రెంచ్ పనులు చేస్తున్నారు. స్థానిక ఎంపీడీఓ పీకేఎం బాబు ట్రెంచ్ పనులను పరిశీలించారు. అనంతరం ఈ రోజు పనులు చేస్తున్న కూలీల మస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఉపాధి కూలీలు నిర్ణీత కొలతల మేరకు పనులు చేపట్టాలని సూచించారు. కూలీలకు గిట్టుబాటు ధర అందేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీఓ ఆదేశించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



ప్రసంగిస్తున్న బాల్ రక్షా భారత్ కో–ఆర్డినేటర్ హేమంత్

వరదయ్యపాళెం: శ్రీసిటీలోని మోండెలెజ్ చాక్లెట్ పరిశ్రమ, వరదయ్యపాళెంలోని బాల్ రక్షా భారత్ సంస్థలు సంయుక్తంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. గురువారం రాజగోపాలపురం ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. సమావేశంలో రొమ్ము క్యాన్సర్ రావడానికి గల కారణాలు, వాటి లక్షణాలు, నివారణ చర్యల గురించి మహిళలకు వివరించారు. ప్రతిఒక్కరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో బాల్ రక్షా భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ బాలాజీ, కో–ఆర్డినేటర్ హేమంత్, సూపర్‌వైజర్లు రాజేష్, కిరణ్‌కుమారి, సుబ్రమణ్యం, తులసి, పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మీ, ఏఈఓ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి సాయికుమార్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పెద్ద కన్నలి సచివాలయం పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ తెలిపారు. ఆయన గురువారం బైపాస్ రోడ్డు సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పర్మినెంట్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో పనులు సక్రమంగా చేయలేకపోయామని వివరించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



బాలకృష్ణ(ఫైల్)

ఏర్పేడు: మండలంలోని కుమ్మరిగుంటకు చెందిన బాలకృష్ణ(36) అదృశ్యమయ్యాడు. ఆయన ఈ నెల 18వ తేదీ రాత్రి భోజనం చేసి నిద్రించాడు. 19వ తేదీ ఉదయం చూడగా అతను కనిపించలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. దీంతో భార్య అంకమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీహరి తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- వీఎంపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణం 1వ వార్డులోని వీఎంపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఆయనకు వార్డు ఇన్‌చార్జి పసల సురేష్, శ్రీకాళహస్తీశ్వరాలయ బోర్డు సభ్యురాలు పసల సుమతి, పసల రామచంద్రయ్య, పసల కృష్ణయ్య గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించి వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ మూడేళ్లలో సగటున రూ.4 లక్షలకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా గూడు కట్టుకుపోయాడని పేర్కొన్నారు. గతంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా గెలిచిన బొజ్జల కుటుంబం హైదరాబాద్‌లో కూర్చుని ఇక్కడి ప్రజలను గాలికొదిలేశారని విమర్శించారు. తాను గెలిచిన నాటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉంటూ కష్ట, సుఖాల్లో పాలుపంచుకుంటున్నట్లు స్పష్టం చేశారు. సామాన్యుడెవరైనా తమ కష్టాలను శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయానికి వచ్చి చెప్పుకుంటే తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గత పెత్తందారీ పాలనకు, తమ సంక్షేమ పాలనకు తేడాను గుర్తించాలని కోరారు. 2024లో జగనన్నను ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ రావు పవార్, ముత్యాల పార్థసారథి, వయ్యాల కృష్ణారెడ్డి, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు సిరాజ్‌బాష, మున్నా, జయశ్యాం, పంతులు, చిట్టివేలు జయగోపాల్, మల్లికార్జునగౌడ్, యుగంధర్‌రెడ్డి, కొత్తపాటి శ్రీనివాసరెడ్డి, జయరామయ్య, సిద్దులుగారి మురళి, కంఠా ఉదయ్, పఠాన్ ఫరీద్, హరినాయుడు, కొట్టే శరవణ, ప్రమీలమ్మ, పద్మ, సాగర్‌బీ, రుష్యేంద్రమణి, మాధవి, షర్మిల మురళియాదవ్, డిష్ ధర్మయ్య, కయ్యూరి ఈశ్వరయ్య, పసల రమణయ్య, ప్రసాద్, సాయి, గంగయ్య, హరి, భార్గవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే వివక్ష లేని సంక్షేమ పాలన



మట్లాడుతున్న బియ్యపు పవిత్రా రెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో వివక్ష, దళారులు లేని సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రాంగణంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా నేరుగా సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేస్తున్న ప్రభుత్వం జగనన్నదని వివరించారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ పిల్లల గురించి పట్టించుకోలేదని, జగనన్న నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల దశ దిశ మార్చారని తెలిపారు. పిల్లలు బాగుంటేనే రేపటి మన రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని నమ్మిన మహోన్నత వ్యక్తి మన జగనన్న అని అన్నారు. మన ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్పించిన ప్రాధాన్యత దేశ చరిత్రలో ఏ ఒక్కరూ ఇవ్వలేదని తెలిపారు. జగనన్న తీసుకువచ్చిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వివరించారు. ఒకప్పుడు పనుల కోసం ప్రజలు నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు నాయకులే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని చెప్పారు. శ్రీకాళహస్తిలో 30 ఏళ్లుగా ఎమ్మెల్యేగా గెలిచిన వారు ప్రజల కోసం ఏనాడూ పనిచేయలేదని, ఓట్లు వేయించుకుని గెలిచి హైదరాబాదులో వెళ్లి కూర్చునేవారని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు వయ్యాల క్రిష్టారెడ్డి, జెడ్పీటీసీ సుబ్బారెడ్డి, తిరుమలయ్య, తిరుపతి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఢిల్లీ బాబు, తిరుపతి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు దాస సుబ్రమణ్యం, వడ్లతాంగల్ బాలాజీ రెడ్డి, మహిళా మండల కన్వీనర్ రాజ్యలక్ష్మి, మనోహర్ రెడ్డి, చెంచయ్య నాయుడు, గోపీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ తిరుమలయ్య

ఏర్పేడు: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ కావేరి తిరుమలయ్య తెలిపారు. మండలంలోని అంజిమేడులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో 390 మందిని పరీక్షించి ఉచితంగా మందుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాతే కాల్వ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, ఎంపీడీవో గిడ్డయ్య, డాక్టర్లు శివప్రియ, నాగరాజు, శిల్ప, ఉప సర్పంచ్ తేజోవతి, వైఎస్సార్ సీపీ నాయకులు కన్నలి లోకనాథరెడ్డి, శంకర్‌రెడ్డి, గున్నయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లోనే ప్రభుత్వ వైద్యసేవలు

సత్యవేడు: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామంలోనే అన్ని రకాల వైద్యసేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం సత్యవేడు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తిరుపతి రుయా వైద్యశాల డాక్టర్ రేఖ (గైనకాలజిస్టు), మోహన్ కృష్ణ జనరల్ సర్జన్, పీహెచ్‌సీ డాక్టర్లు గుణశేఖర్, లావణ్య 468 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, సర్పంచ్ మంజుల, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ కార్యదర్శి హరీష్, సీడీపీఓ దేవకుమారి, రమేష్, లెప్రసీ ఆఫీసర్ రాజ, (జగనన్నక్యాంపు ఆఫీసర్ తిరుపతి), ఎంహెచ్ఈఏ ఎస్.సుబ్రమణ్యం, ఏఎన్ఎం షీలా, రోస్‌లిన్ పాల్గొన్నారు.



జగనన్న కిట్లు, కంటి అద్దాలు అందజేస్తున్న మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి

హరిప్రసాద్‌కు ఘన నివాళి



పాడె మోస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: గుండెపోటుతో మృతిచెందిన పెనుమల్లంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు హరిప్రసాద్‌కు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఆయన భౌతికదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి హరిప్రసాద్‌కు నివాళులర్పించారు. స్మశానం వరకు పాడెని మోశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, నాయకులు రాజా, వెంకటేశ్వర్లు, హేమంత్‌నాయుడు, నాగరాజు, గోపీ యాదవ్, మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాదాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న అంగేరి పుల్లయ్య

శ్రీకాళహస్తి: దేశంలో లౌకిక వాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా వుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో గురువారం శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, నియోజకవర్గాల సీపీఎం ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ అనుసరిస్తున్న రాజకీయాలతో ప్రజాస్వామ్యం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో నవంబరు 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దాసరి జనార్దన్, గంధం మణి, పెనగడం గురవయ్య, షరీఫ్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ

పిచ్చాటూరు: మండలంలోని ప్రభుత్వ స్కూళ్లకు ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్ రాజు మధ్యాహ్న భోజన వంట సామగ్రి, మరుగుదొడ్ల సామగ్రిలతో పాటు బాత్‌రూమ్ క్లీనింగ్ మెటీరియల్‌ను గురువారం పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఈ సామగ్రిని మండలంలోని 36 పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు అందించడంలో భాగంగా ప్రభుత్వం ఈ వస్తువులను పంపిణీ చేసిందని ఎంఈఓ హేమమాలిని వెల్లడించారు. వీటిని సక్రమంగా వినియోగించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా పాఠశాల హెచ్‌ఎంకు బాధ్యత తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది శెల్వం, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



పిచ్చాటూరు: వంటసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్ రాజు

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నాగలాపురం: జిల్లాస్థాయి పోటీలకు నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యా రు. గురువారం పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాగలాపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు గగన్ రాజ్, నందిని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులకు పీఈటీ బాబు, సురేంద్ర, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

తప్పులను సరిచేసుకోండి




సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి, ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను పరిశీలిస్తున్న రైతులు

నారాయణవనం: రైతులు సాగు చేసిన పంటల నమోదును ఈ–క్రాప్ ముసాయిదాలో సరి చేసుకోవాలని ఏఓ శోభారాణి అన్నారు. భీమునిచెరువు రైతు భరోసా కేంద్రంలో గురువారం జరిగిన రైతుల సమావేశంలో శోభారాణి మాట్లాడుతూ 2023 రబీలో సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ–క్రాప్ బుకింగ్ నమోదు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మండలంలోని 12 ఆర్బీకేలలో పంట నమోదు ఈ–క్రాప్ జాబితాను నోటీసుబోర్డులో ఉంచామన్నారు. జాబితాలో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సంబంధిత రైతులు తమ పరిధిలోని ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులకు ఫిర్యాదులను ఈనెల 29వ తేదీ ఆదివారంలోపు అందించాలని సూచించారు. ఈ–క్రాప్‌లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాలతో కలిగిన నష్టపరిహారం ప్రభుత్వం నుంచి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆర్బీకేలలో 29వ తేదీ వరకు జరిగే గ్రామసభల్లో రైతులు పాల్గొని ముసాయిదా జాబితా సవరణకు సహకరించాలని ఆమె కోరారు. భీమునిచెరువు ఆర్బీకేలో జరిగిన సమావేశంలో వ్యవసాయ సహాయకులు చిన్న రమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండల పరిధిలో సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం వైభవంగా ప్రదోష పూజలు జరిగాయి. ముందుగా నందీశ్వర స్వామికి, శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో పూజలు నిర్వహించారు. ప్రదోష పూజలకు ఉభయదాతలుగా తిరుపతి జిల్లా, ముండ్లపూడి గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి ఉభయదారులకు ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాట్లు చేయించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ప్రదోష పూజల అనంతరం స్వామివారి ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఎస్ఎం సురేష్, ప్రధాన అర్చకులు, సభ్యులు మునివేలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కనక దుర్గాదేవి గ్రామోత్సవం



సత్యవేడు: గ్రామోత్సవంలో కనకదుర్గా అమ్మవారి ఊరేగింపు

సత్యవేడు: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా సత్యవేడు వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాన్ని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విజయదశమి శరన్నవరాత్రుల సందర్భంగా సర్వమంగళాదేవి ఆలయంలో ప్రత్యేకంగా కొలువుదీర్చిన కనకదుర్గాదేవికి నవరాత్రులు ఆలయంలో ప్రత్యేక హోమం, పూజలు చేపట్టారు. శరన్నవరాత్రుల్లో శ్రీ బాలత్రిపురా సుందరిగా, శ్రీకాళికాదేవి, శ్రీ లలితాదేవి, శ్రీ రాజరాజేశ్వరి, శ్రీలక్ష్మి, శ్రీ అన్నపూర్ణదేవి, సరస్వతిదేవి, మహిషాషుర మర్దినిగా పలు రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపువీధి, గంగమిట్టవీధి, దేవాంగపురం వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి మంగళ వాయిద్యాలతో వైభవంగా ఊరేగించారు. భక్తులు వారి ఇళ్ల వద్ద అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చారు. 101 కలశాలను భక్తులు అమ్మవారి ఊరేగింపు వెంట తీసుకొచ్చారు. సాయంత్రం నిమజ్జనం సందర్భంగా భక్తులు అమ్మవారి పాటలు పాడుతూ చెరువులో నిమజ్జనం చేశారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న శివయ్య

ఏర్పేడు: స్థానిక కమ్మవీధిలోని రామాలయం నుంచి ఓం నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ నల్లపాలెం శివయ్య భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.11.5 లక్షల నిధులు మంజూరు చేసిందని సర్పంచ్ తెలిపారు. దీంతో గ్రామంలో 203 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మయ్య, పంచాయతీ రాజ్ ఏఈ రవితేజ, సాంబయ్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న టీటీడీ స్థానిక ఆలయాల మూత

తిరుపతి కల్చరల్: పాక్షిక చంద్ర గ్రహణంగా కారణంగా శనివారం సాయంత్రం టీటీడీ స్థానిక ఆలయాలు మూసివేస్తారు. ఆదివారం ఉదయం తెరుస్తారు. 29న వేకువజామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణానికి 6 గంటల ముందు ఆలయాలు మూసివేయడం ఆనవాయితీ. తిరుచానూరు పద్మావ తి అమ్మవారి ఆలయం, గోవిందరాజస్వామి, కోదండరామ స్వామి, శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకన్న ఆలయాలను 28న రాత్రి 7 గంటలకు మూసివేసి 29న తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు.

సంయుక్త పథకంపై అవగాహన



పిచ్చాటూరు: సంయుక్త పథకంపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ రాజశేఖర్ రెడ్డి

పిచ్చాటూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంయుక్త పథకం ద్వారా గ్రామ కంఠాలకు శాశ్వత ఇంటి పట్టాలు మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డీపీఓ రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా సచివాలయ సర్వేయర్లు ఇప్పటికే గ్రామ కంఠాలను గుర్తించి డ్రోన్ సర్వే పూర్తి చేశారన్నారు. ఇంటి పట్టాలకు సంబంధించిన కచ్చితమైన హద్దులు గుర్తించి, వాటి డాక్యుమెంటేషన్ పనులపై సర్వేయర్లు, సచివాలయ కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈఓపీఆర్‌డీకు అవగాహన కల్పించారు. డీఎల్‌పీఓ రూపారాణి, పిచ్చాటూరు ఈఓపీఆర్‌డీ శ్రీదేవి, పుత్తూరు, నారాయణవనం ఈఓపీఆర్‌డీలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం

చంద్రగిరి: తొండవాడ సమీపంలోని స్వర్ణముఖనది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఉత్సవాల సందర్భంగా గురువారం ధ్వజారోహణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి గణపతి హోమం చేశారు. భక్తులతో గోపూజ చేయించారు. కలశ స్థాపన, మండపారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చేతుల మీదుగా ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి మాడవీధుల్లో సింహ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రఘురామిరెడ్డి, మొగిలి వంశస్తులు, ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, హేమంత్ స్వామి పాల్గొన్నారు.